# యాదృచ్ఛికం

సీతమ్మ స్తబ్దంగా నుంచుంది.

మాటలు ఈటెల్లా, చూపులు శరాల్లా మనసులో గుచ్చుకుంటున్నై.

ఆవిడ అవుననలేదు - కాదనలేదు. నిశ్శబ్దంగా కన్నీరు జారిపోతోందంతే.

నిజాయితీ అంటే ఆవిడ కిష్టం.

నీతి మీద నమ్మకం.

సత్యం పలకడంలో ఆసక్తి.

కష్టపడడంలో ఆనందం-

ఇవన్నీ సంతరించుకుని ఆదర్శ మహిళ కావాలని ఆవిడెప్పుడూ అనుకోలేదు- స్వభావంగా వచ్చిన గుణగణాలివి. మనిషికి బలహీనమైన క్షణాలు రావని కాదు- కానీ నేటివరకైతే ఏ బలహీనతకూ లోను కాకుండా ఆత్మగౌరవంతో రోజులు గడుపుతోంది- మరి ఇప్పుడు?

"ఏదో కక్కుర్తి పడ్డావుగానీ, నీమీద మేమేం రిపోర్టివ్వం— తీసిన ఉంగరం ఇచ్చెయ్".

ఆమె ఉలిక్కి పడింది.

"తీసిన ఉంగరమా, తియ్యని ఉంగరమా?- సీతమ్మ మాట్లాడ లేదు- ఆమె మనసు, గొంతూ కూడా మూగవోయినై.

నడివయసు దాటుతూన్న సీతమ్మకిది పెద్ద ఆఘాతం- కొడుక్కి విషయం తెలిస్తే ఏం బాగుంటుంది? ఈలోపే తన ప్రాణం పోతే?

ఆమె కళ్ళు ఎర్రబడినై, గుండెలు దడ దడ కొట్టుకుంటున్నై. పెరట్లో బావి తప్ప కళ్ళముందు ఇంకేం కనిపించడం లేదు.

రెండడుగులు అటు వేసిందో లేదో అసంకల్పితంగా లక్ష్మి వచ్చి చెయ్యి గట్టిగా పట్టుకుంది.

పక్కనుంచి ఎవరో అంటున్నారు. 'పారిపోతోంది'-అని.

ఆనాడెప్పుడో సీతమ్మవారు అవమానం భరించలేక ఒకసారి అగ్నిలోకి దూకింది. మరోసారి భూమిబద్దలై అందులోకే వెళ్ళి పోయింది. తనిపేరూ సీతేగా-తనూ భూమిలోకి ఉన్నపాట్న వెళ్ళి పోతే....ఆవిడ తల మాత్రం అవమాన భారంతో భూమిలోకి క్రుంగి పోతోంది.

అయినా తనా ఉంగరం తియ్యలేదని ఎందువల్ల గట్టిగా చెప్పలేక పోతోంది? అసలు బాత్రూమ్‌లో ఉంగరం పెట్టానంటుంది లక్ష్మి - అస లామెకు గుర్తుందో, లేదో....

పూనకం వచ్చినట్లు ఒక్కసారి శక్తంతా కూడదీసుకొని గట్టిగా అరిచింది సీతమ్మ–"ఉంగరం నేను చూడలేదు–నాకసలు తెలియదు–"

ఆమె అరుపుకి లక్ష్మి, శేఖర్ బిత్తరపోయి చూశారు. ఆమెది గౌరవనీయమైన కుటుంబమనీ, దొంగతనం చేసేబుద్ధి ఆమెకు లేదనీ–ఇద్దరి మనసుల్లోనూ మెదుల్తూనే వుంది.

తన పనేదో తను చేసుకొని పోవడం తప్ప సీతమ్మ ఎప్పుడూ వాళ్ళ కుటుంబ విషయాల్లోకూడా జోక్యం చెసుకోలేదు.

లక్ష్మి, శేఖర్‌ల పెళ్లై పదేళ్ళు దాటినా సంతానం కలుగలేదు. ఇద్దరూ ఎంతో బాధ పడ్డారు. ఎందరో డాక్టర్లను సంప్రదించి, పరీక్షలు చేయించుకుని, మందులు వాడగా, ఇన్నేళ్ళకు అపురూపంగా లక్ష్మి కడుపు పండింది. నెల తప్పిన దగ్గర్నుంచి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలనీ, లక్ష్మికి చాలా విశ్రాంతి అవసరమనీ డాక్టరు చెప్పింది.

చాలీ చాలని ఒక జీతంతో నానా అవస్థలు పడుతున్న కొడుకును కాస్తన్నా భారం తగ్గించాలన్న ఉద్దేశంతో సీతమ్మ లక్ష్మి ఇంట్లో కాస్త ఆ పనీ, ఈ పనీ సాయంగా వుండేందుకు ఒప్పుకుంది.

ఇంకో రెండు నెలల్లో లక్ష్మి నీళ్ళాడుతుంది. ఈ ఘటన జరిగి ఉండకపోతే సీతమ్మకు ఇంకో ఐదారు నెలలన్నా సుఖంగా ఆ ఇంట్లో గడిచి పోవాల్సింది.

లక్ష్మి, శేఖర్ కూడా స్వతహాగా చాలా మంచివాళ్ళు. ఎప్పుడూ తనని కుటుంబంలో ఒకరుగా చూశారుగానీ వేరు చేయలేదు.

అట్లాంటిది-ఈ రోజీ సంఘటన....

చేరిన ఇరుగు, పొరుగు వాళ్ళని వెళ్ళిపొమ్మని, వాళ్ళంతా వెళ్ళి పోయాక శేఖర్ అన్నాడు, "జరిగిందేదో జరిగిపోయింది. వెళ్ళి పని చూసుకోండి'' అని.

దొంగతనం చెయ్యని తనపట్ల వాళ్ళు ఉదారత ప్రదర్శించ డమా? సీతమ్మకు కారం రాసుకున్నట్లు ఒళ్లు మండిపోతోంది. బాధతో అవమానంతో మనసు మండి పోతోంది. "క్షమించండి- నేనీ దొంగ తనం చెయ్యలేదు. అయినా ఇక నేనిక్కడకు రాలేను" చివ్వున వెను దిరిగి గబగబా వెళ్ళిపోయింది సీతమ్మ.

ఇదంతా జరగిడానికి పట్టిన సమయం అర్ధగంట. అంతకుముందే లక్ష్మి ఉంగరం జారిపోయే అవకాశమున్న చోటల్లా వెతికింది. ఎక్కడా కనిపించక పోయేసరికి అనుమానం సీతమ్మ మీదికి వెళ్ళింది. అనుకో కుండా ఎవరి ప్రమేయమూ లేనట్లుగా జరిగి పోయిందంతా.

"ఆవిడను అనవసరంగా అనుమానించామేమో లక్ష్మి''అన్నాడు శేఖర్.

సీతమ్మ వెళ్ళినవైపే చూస్తూ బాధగా. లక్ష్మి మాట్లాడలేదు. ఈ సమయంలో పని చేసుకోవడం ఇబ్బందికరమేగాదు-ప్రమాదమనీ, చాలా విశ్రాంతి అవసరమనీ డాక్టరు హెచ్చరించింది-మళ్ళీ ఇప్పుడు పనికి ఎవరిని బతిమాలాలా అని ఆలోచిస్తున్నదామె.

X X X

సీతమ్మ మళ్ళీ ఆ ఇంటికి వెళ్ళలేదు. తాను చేయని దొంగతనా నికి ఎందుకు బాధ పడాలని మనసునెంత సరిపెట్టుకున్నా మీదపడ్డ నింద ముల్లులా గుచ్చుతూనే వుంది.

రెండు నెలలు గడిచాక ఎవరో చెప్పారు. లక్ష్మికి బాబు పుట్టా డని. సీతమ్మ సంతోష పడింది-ఒకసారి చూద్దామా అనిపించింది. కానీ వెళ్ళాలంటే మనస్కరించలేదు.

మరో రెండు నెలలు గడిచిపోయినై.

ఓరోజు ఉదయం లక్ష్మి చెల్లెలు లలిత వచ్చింది, లక్ష్మి తాలూకు. ఎవర్ని చూసినా ఉలిక్కి పడినట్లవుతుంది సీతమ్మ. గతంనీడలు కళ్ళల్లో రాయిలా గరగర లాడినై.

"రేపు బాబును ఉయ్యాల్లో వేస్తున్నాం. అక్క మిమ్మల్ని తప్ప కుండా రమ్మంది"- అంది లలిత.

"నేనా, ఒంట్లో అంత బాగాలేదమ్మా చూస్తాను" అంది తలెత్త కుండానే సీతమ్మ.

"లేదండీ! మీరు రాలేదని అక్క అనుకుంటోంది. కొంచెంసేపు ఉండి వెళ్ళరుగాని రావడానికి ప్రయత్నించండి" అని చెప్పి వెళ్ళిపో యిందా అమ్మాయి

సాయంత్రందాకా అన్యమనస్కంగా గడిపిన సీతమ్మ అప్రయ త్నంగా లక్ష్మి ఇంటివైపు నడిచింది.

వాళ్ళింటోమందిని పిల్చుకొని వుంటారు. తను లోపలికి వెళ్ళ డమా, మానడమా—అంతదూరం వెళ్ళిన సీతమ్మ సందిగ్ధంగా తచ్చాడు తోంది- కాని ఎందుకో లోపల వాతావరణం కోలాహలంగా స్తబ్ధంగా అనిపించింది. మనసెందుకో ఆందోళన పడింది.

వాళ్ళింట్లోకి అడుగుపెట్టాలంటే అదొక రకమైన బాధగా వుంది. ఇంతదూరం వచ్చి వెనక్కు వెళ్ళడమేమిటనుకుంటూ గేటుతీసి లోపలికి అడుగుపెట్టింది. గేటునుంచి ఇల్లు చాలా లోపలికి వుంటుంది - లోప ల్నుంచి ఎవరో ఏడుపు....మనసు కీడు శంకిస్తుంటే కొట్టుకుంటున్న గుండెలతో లోపలికి అడుగుపెట్టిన సీతమ్మ అయోమయంగా నిలబడి పోయింది.

నిర్జీవంగా వున్న నెలల పసికందును లక్ష్మి ఒళ్ళో పెట్టుకుని విలపిస్తున్నది.

అది కలో నిజమో అర్థం కాలేదు సీతమ్మకు. నిన్ననే కదా బారసాలకని పిలిచి వెళ్ళింది ఈలోపు ఇంత ఘోరం ఎట్లా జరిగిందో అర్థం కావడంలేదు. సీతమ్మకు.

ఆలంకరించిన ఉయ్యాల, పేరంటాళ్ళకియడానికి పెట్టిన పసుపు కుంకుమలూ, తాంబూలం, గడపలకు తోరణాలు, ముంగిట ముగ్గులు- ఈ అలంకరణ, ఏర్పాట్లన్నీ కూడా బారసాలకి కాకుండా ఆ పసివాడి వీడ్కోలుకు చేసిన ఏర్పాట్లలాఉన్నై.

లోపలికి అడుగుపెట్టి విభ్రాంతిగా నుంచున్న సీతమ్మను చూసి లక్ష్మి బావురుమంది– "ఎన్నో ఏళ్ళు తపస్సు చేశాను సీతమ్మా, ఈ బిడ్డ కోసం....కానీ వీడు రెండు నెల్లు మురిపించి మోసం చేశాడు".

గర్భశోకం వ్రాతల కందనిది, మాటల్లో చెప్పలేనిది– అది మనస్సును మండిస్తుంది. కడుపులోంచి తెరలుతెరలుగా దుఃఖం తన్నుకొస్తుంది. చైతన్యవంతమైన మనస్సును స్తబ్ధంగా, నిస్తేజంగా చేస్తుంది. బతుకు శూన్యంగా మారిపోతుంది. మతిభ్రమించినట్లనిపిస్తుంది. దుఃఖానికి ప్రతీకలా వున్న లక్ష్మినీ, అక్కడి సన్నివేశాన్నీ చూసిన సీతమ్మకు దుఃఖమాగడంలేదు. ఆమె ఆప్యాయంగా లక్ష్మిని దగ్గరకు తీసుకొని గుండెలకు చేర్చుకుంది.

పుట్టిన పిల్లవాడికి పుట్టుకతోనే గుండెలో ఏదో లోపం ఉందిట. ఆపరేషన్ చెయ్యాలిట. కానీ వెంటనే చెయ్యడానికి వీల్లేదు. ఏం జరిగిందో హఠాత్తుగా మధ్యాహ్నానికి పిల్లాడు ఊపిరాడనట్లుగా శ్వాస బలవంతంగా తీశాడట. డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళేసరికి ఊపిరాగిపోయిందట.

శేఖర్ మగవాడుగనుక స్తబ్దంగా కూర్చున్నాడు.

"పిల్లాడ్నేదైనా పాత చీరలో చుట్టండి" అంటున్నారెవరో.

లక్ష్మి చెల్లెలు లలిత అక్కడేవున్న పెట్టెదో తీసింది. పెట్టెలో

అడుగు నుంచి ఒక పీర పైకి గుంజేసరికి అంచులో నుంచి జారిపడింది- ఉంగరం.... ఎర్రరాయి పొదిగిన బరువైన ఉంగరం-

లక్ష్మి, శేఖర్, సీతమ్మ- ముగ్గురు ఒకేసారి ఉలిక్కిపడ్డారు.

అంత బాధలోనూ లక్ష్మి హృదయం సీతమ్మ ననుమానించినం దుకు బాధగా మూలిగింది.

ఆమె మనసు కలవర పడుతోంది. అసూయకురాలైన సీతమ్మ ననుమానించి, అవమానించిన ఫలితమా ఇది? అని మనసులో ఒకమూల ఆవేదన సుడితిరుగుతున్నది. లేకపోతే సరిగ్గా ఈరోజే అదీ సీతమ్మ ఇంట్లోకి అడుగుపెట్టగానే ఇట్లా జరగడం....జరిగిన అనర్థంతో అస్వ యించకుండా ఉండలేకపోతోందామె.

ఇది అనవసరంగా సీతమ్మ ననుమానించినందుకు శిక్షా? లక్ష్మి మనసంతా గందరగోళంగా తయారైంది. శేఖర్ నిర్లిప్తంగా, ప్రేక్ష కుడిలా ఉండిపోయాడు.

ఏది ఏమైనా, ఎవరి మనసుల్లో ఏమున్నా మాతృ హృదయ మెంత క్షోభిస్తున్నా విధి వికటంగా, దురుసుగా పసికందును మాయం చేసింది. జరగవలసిన కార్యక్రమం క్షణాల మీద జరిగిపోయింది-లక్ష్మి, శేఖర్ల హృదయాన్ని శూన్యం చేస్తూ.

X X X

గాయాలను మాన్పే మందులా కాలం నిశ్శబ్దంగా సాగిపోతోంది.

లక్ష్మి బాధకు ఓదార్పు కలిగించడం బాధ్యత అనుకున్నదేమో సీతమ్మ అప్రయత్నంగానే లక్ష్మి దగ్గరకు వెళ్ళటం, ఊరట కలిగించి, ఆపనీ, ఈపనీ చేసిపెట్టడం-అలవాటుగానే గాక ఆమెతో సాన్నిహిత్యాన్నీ, ఆప్యాయతనూ పెంచుకోడం జరిగింది. ఎన్నేళ్లో తపస్సుచేస్తే చేతికందిన ఫలం మట్టిపాలైన లక్ష్మి కడుపుకోతను సాటిమనిషిగా సీతమ్మ స్నేదర్థీర్చ యత్నించేది.

సీతమ్మ రాక కోసం లక్ష్మి ఎదురుచూపు,

లక్ష్మిని మామూలు మనిషిగా చెయ్యాలన్న సీతమ్మ ఆవేదన-

అసంకల్పితంగా జరుగుతున్నై.

ఈ ఘటనలో మానవత వుంది.

అంతకుముందు లక్ష్మి ఉంగరం పోవడంగానీ, ఆ నింద సీతమ్మ మీద పడి ఆమె అతి బాధపడ్డ విషయంగానీ-ఇద్దరి మనసుల్లోనూ లేదు-భర్త తప్ప సన్నిహితులు లేని లక్ష్మి, సీతమ్మ చేరికలో ఆశ్వాసన పొందుతుంది. ఆ వేళ—

దట్టంగా పట్టిన మబ్బులు గాలికి చెల్లాచెదురవుతున్న ఆకాశాన్ని చూస్తూ లోపలికి అడుగు పెడుతున్న సీతమ్మకు, చిరునవ్వుతో ఎదురొచ్చిన లక్ష్మి తరువాత చెప్పిన వార్త విని- మనసు నిండిన ఆనందం పెదవుల మీదికి ప్రసరించగా, చిరునవ్వుతో ఆమె పొట్టవైపు చూస్తూంటే సిగ్గుగా నవ్వి తల వంచుకుంది లక్ష్మి. అప్పటికి ఆకాశంలో మబ్బులు పూర్తిగా చెదిరిపోయినై.